క్లుప్తంగా

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రొద్దుటూరు : స్థానిక విజయనగరం వీధిలోని దివ్యాంగుడు శివుడుకు ఆల్ ఆఫ్ యూ దివ్యాంగులు, వయోవృద్ధుల సేవా సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు అందించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన శివుడుకు కాలు తీసివేశారని, అనారోగ్యంతో ఇంటి నుంచి బయటికి వెళ్లే పరిస్థితి లేదని సొసైటీ గౌరవాధ్యక్షుడు వై.చలపతి రావు, కన్వీనర్ అఫ్జల్ తెలిపారు. దాతలు పల్లా నారాయణ, పల్లా ఆంజనేయులు సహకారంతో బియ్యం, నిత్యావసర వస్తువులు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దాతలు పల్లా నారాయణ, పల్లా ఆంజనేయులు, సొసైటీ ప్రధాన కార్యదర్శి ఖాదర్‌వలి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి జట్టు ఎంపిక

మైదుకూరు : షూటింగ్‌బాల్ పోటీలు నిర్వహించి జిల్లాస్థాయి జట్టును బుధవారం ఎంపిక చేశారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ శాప్‌లీగ్ ఫేజ్–2 కింద ఈ పోటీలు జరిగాయి. చీఫ్ కోచ్‌తోపాటు పలు ఆటల కోచ్‌లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ

చాపాడు : మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో బుధవారం మండలంలోని పలువురు దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్లు, సహాయ పరికరాలను మండలాధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సమస్యల పట్ల అన్ని రకాలుగా సహకరిస్తుందన్నారు. దివ్యాంగులకు అవసరమైన పరికరాలను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. దివ్యాంగులకు 5 వీల్ చైర్లు, ఒక సీపీ చైర్, ఒక జత చంక కర్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ఎంఈఓ రవిశంకర్, ఐఈఆర్పీ లక్ష్మిరెడ్డి, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుకు సత్కారం

ఖాజీపేట : అధిక దిగుబడి సాధించిన రైతు భూమిరెడ్డి లక్ష్మిరెడ్డిని తహసీల్దారు రమణ రెడ్డి సత్కారించారు. బుధవారం మండల కేంద్రంలో ఫర్టిలైజర్ యాజమాన్యం, అధికారులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రైతు లక్ష్మిరెడ్డి తన 33 ఎకరాల్లో వరి వేసి, ఎకరాకు 5 పుట్ల రెండు బస్తాల దిగుబడి సాధించడం అభినందనీయమని పలువురు అన్నారు. ఈకార్యక్రమంలో కో– ఆప్షన్ సభ్యుడు కరీముల్లా, ఏపీఐబీసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి నాగార్జునతోపాటు వ్యవసాయ సిబ్బంది, ఫర్టిలైజర్ యాజమాన్యం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దువ్వూరు : మండలంలోని భీమునిపాడు గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 30 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి బుధవారం తెలిపారు. చాపాడు మండలం విజయనగరం గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి తన బొలెరో వాహనంలో 30 బస్తాల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నారాయణ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జయనగర్ లోని నారాయణ పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను ఏజీఎం చెన్నకేశవ రాజు, ఆర్ఐ నజీర్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని ముగ్గులతో తీర్చిదిద్దారు. సంప్రదాయ వేషధారణలతో విద్యార్థులు గాలిపటాలను ఎగురవేశారు. ప్రిన్సిపాళ్లు శివ, హుసేన్, ఏడీ సుధాకర్, ప్రేమజ్యోతి, అనీష తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో ప్రధాన అభివృద్ధి పనులకు భూమిపూజ

• ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మురుగు కాలువల ఆధునికీకరణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి సంబంధించి రెండు ప్రధాన అభివృద్ధి పనులకు ఫిబ్రవరి మొదటి వారంలో భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2021 డిసెంబరు 23న రూ.520 కోట్లతో 8 అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శిలాఫలకాలు వేశారన్నారు. అందులో భాగంగానే రూ.163 కోట్లతో పట్టణంలోని ప్రధాన కాలువలను ఆధునీకరించడంతోపాటు కొత్తపల్లె పరిధిలోని రింగ్ రోడ్డు సమీపంలో ఐదెకరాల విస్తీర్ణంలో మురికి నీటి శుద్ధి కర్మాగారాన్ని నిర్మిస్తామని వివరించారు. ఈ పనుల్లో భాగంగా పట్టణంలోని వీధుల్లో 70 కిలోమీటర్ల వరకు అంతర్గత కాలువలను నిర్మించాల్సి ఉందని, 5.26 కిలోమీటర్ల మేర పెద్ద కాలువలను నిర్మించాలి ఉంటుందన్నారు.

రూ.119 కోట్లతో తాగునీటి పైపులైన్ నిర్మాణం

పట్టణ పరిధిలో తాగునీటిని అందించేందుకు రూ.119 కోట్లతో పైపులైన్ నిర్మాణ పనులను ఫిబ్రవరిలోనే భూమి పూజ చేసి ప్రారంభిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఈ పనుల్లో భాగంగానే 156 కిలోమీటర్ల మేర పట్టణంలో పైపులైన్ నిర్మించాల్సి ఉంటుందని వివరించారు. ఏడాదిలోపు పైపులైన్ పనులు పూర్తవుతాయని, 2024 ఆఖరు నాటికి డ్రైనేజీ కాలువల ఆధునీకరణ పనులు పూర్తవుతాయని ఎమ్మెల్యే చెప్పారు. ఈ రెండు ప్రధాన అభివృద్ధి పనులు పట్టణ ప్రజలకు సంక్రాంతి కానుక అని తెలిపారు. పబ్లిక్ హెల్త్ ఈఈ చెన్నకేశవరెడ్డి, కార్తికేయ ఇన్‌ఫ్రా ఎండీ జి.బసిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి,కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ కన్న కలల స్వరాజ్యం సాకారం

రాజుపాళెం : జాతిపిత గాంధీ తాత కన్న కలలను మనుమడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశాడని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని గాదెగూడూరు గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం సాయంత్రం సర్పంచ్ పోలా వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలా వెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే రాచమల్లు ప్రారంభించారు.

అర్హుల ఇంటి వద్దకే పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



తోట్లపల్లె బీసీ కాలనీలో సంక్షేమ పథకాలను తెలుపుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతోపాటు గ్రామాల్లో సమస్యలను తెలుసుకొనేందుకు ప్రజల వద్దకు వెళుతున్నామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని తోట్లపల్లె గ్రామ సచివాలయం పరిధిలో నర్సిరెడ్డిపల్లె, తోట్లపల్లె, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పని చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని తెలియజేశారు. సచివాలయ వ్యవస్థ దేశానికే గర్వకారణమన్నారు. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నామని వివరించారు. అర్హులకు పథకాలు అందజేస్తున్నామని, ఇంకా ఎవరైనా పథకాలు అందకుంటే వివరాలు తెలుసుకుని వారికి అందేలా చూసేందుకు వచ్చామన్నారు. సమస్యలు తెలియజేసి అక్కడికక్కడే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తోట్లపల్లె బీసీ కాలనీలో సీసీరోడ్లు, తాగునీరు, కరెంట్ సమస్యలు ఉన్నాయన్నారు. నర్సిరెడ్డిపల్లెలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అక్కడే ఉన్న అధికారులతో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు సుబ్బిరెడ్డి, సర్పంచ్ రాయపురెడ్డి లక్ష్మిదేవి, ఓబుల్‌రెడ్డి, పాల్గొన్నారు.

నేడు తోట్లపల్లె పంచాయతీలో..

మండలంలోని తోట్లపల్లె పంచాయతీలో గురువారం మధ్యాహ్నం 2గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం ఉంటుందని ఎంపీపీ వీరనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాపిరెడ్డిపల్లె, కొత్తపల్లె, వడ్డెరకాలనీలో కార్యక్రమం నిర్వహించానున్నామన్నారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి హాజరవుతన్నారన్నారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పాలనలో విప్లవాత్మక మార్పులు

ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ



గిరినగర్‌లో మహిళకు సంక్షేమపథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పాలనలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చారని, అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ అన్నారు. బుధవారం ఆమె పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీ పరిధి గిరినగర్‌లోని అంబేడ్కర్ లైన్, రెడ్డినగర్, ఎస్టీ కాలనీలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి తమకు రానున్న ఎన్నికల్లో మద్దతు పలకాలని కొరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలు అందుకోవాలనే ఉద్దేశంతో స్థానికంగానే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. గతంలో మాదిరి కమిటీల పెత్తనం లేకుండా నేరుగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. దీంతో పాటు స్థానికంగా రైతు భరోసా కేంద్రాలతో వ్యవసాయం, పశు సంపద అభివృద్ధికి, వైఎస్సార్‌హెల్త్ క్లినిక్‌తో పేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్నామన్నారు. బద్వేల్ నియోజకవర్గంలోని ప్రధాన సాగునీటి వనరైన బ్రహ్మంసాగర్‌ను పూర్తి స్థాయి నీటితో నింపామన్నారు. మూడేళ్లుగా రైతులకు సాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూస్తున్నామని, పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించామని వివరించారు. పట్టణంలోని ప్రధాన రహదారిని విస్తరించేందుకు పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు కలవకూరి రమణ, మహబూబ్‌పీరా, చంద్రాయుడు, నాయకులు చాపాటి నారాయణరెడ్డి, చిత్తా గిరిప్రణీత్‌రెడ్డి, ఆదిబోయిన కొండయ్య, చాపాటి సాయి నారాయణరెడ్డి, రుద్రవరం ప్రసాద్, ఎంపీడీఓ నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నాట్యమయూరి అవార్డు



అవార్డులతో హోషికరెడ్డి, హనీషరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు జి.నిరంజన్‌రెడ్డి, ఆర్.అర్చనల కుమార్తెలు నాట్యమయూరి అవార్డులు సాధించారు. హోషికరెడ్డి, హనీషరెడ్డి ఇటీవల చిలకలూరి పేటలో నిర్వహించిన 38వ జాతీయ స్థాయి నృత్య పోటీలలో ప్రతిభ కనపరచి ఇద్దరూ నాట్యమయూరి అవార్డులను పొందారు. వీరిని నాట్యగురువు శ్రావణ్‌కుమార్‌తోపాటు పలువురు అభినందించారు.

కాలువలో పూడిక తొలగింపు



పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని పలు ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనులు చేశారు. వీటిని సర్పంచ్ కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి పర్యవేక్షించారు. ఆర్టీసీ బస్టాండ్, వస్త్రభారతి తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జేసీబీతో బుధవారం తొలగించారు.

ఇస్లాం షరియత్‌పై దుష్ప్రచారం తగదు

బద్వేలు అర్బన్ : ఇస్లామ్ షరియత్‌పై ఏమాత్రం అవగాహన లేకుండా దుష్ప్రచారం చేయడం తగదని షరియత్ అవగాహన కమిటీ బాధ్యులు డాక్టర్ జలీసాసుల్తానాయాసిన్, డాక్టర్ ఖుద్దూసాసుల్తానాలు అన్నారు. ఆలిండియా ముస్లీం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఫాతిమా మసీదు ఆవరణలో ముస్లీం మహిళలకు షరియత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో షరియత్ అవగాహన కమిటీ బాధ్యులు డాక్టర్ జోహార్ జహాన్, ముఫిజహాఫిజల, మాస్క్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రతనాల వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



108 బెల్లం పొంగలి కుండలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున మహిళలు దీపాలు పట్టుకుని భక్తిగీతాలు ఆలపిస్తూ నగర సంకీర్తన చేశారు. ఆలయానికి మహిళలు చేరుకుని ముగ్గులు వేసి దానిపై దీపాలు వెలిగించారు. శ్రీకృష్ణాలయంలో క్షీరాన్న నైవేద్యాన్ని సమర్పించి తిరుప్పావై పాశురాలను పఠించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణాలయ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ పాల్గొన్నారు.

నేడు గాదెగూడూరులో గడపగడపకు..

రాజుపాళెం : మండలంలోని గాదెగూడూరు గ్రామంలో గురువారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ పోలా వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు వస్తున్నారని,ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.







జగనన్న పాలనలో అందరికీ సంక్షేమం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను పంపిణీ చేస్తున్న రమాదేవి

రాజుపాళెం: రాష్ట్రంలో జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక అందరికి సంక్షేమ పాలనను అందిస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సతీమణి కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి అన్నారు. మండలంలోని గాదెగూడూరు గ్రామంలో బుధవారం సాయంత్రం సర్పంచ్ పోలా వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణికి సీమంతం చేశారు. ఎర్రి రమణారెడ్డి, ఎంపీపీ సలోమి, వెంకటరెడ్డి ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు జీరెడ్డి అంజనీకుమారి, హెచ్‌ఎం నాగమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్

బి.కోడూరు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని గుంతపల్లెలో ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గుంతపల్లె యూత్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.25,116లు, రెండవ బహుమతి రూ.15,116లు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి మ్యాచ్‌కు మ్యాన్‌ఆఫ్ దమ్యాచ్, మ్యాన్ ఆఫ్‌ద టోర్నమెంట్ అందజేస్తామన్నారు. వివరాలకు 9902686380 సంప్రదించాలని కోరారు.

స్థల వివాదంలో ఘర్షణ



పోలీసుస్టేషన్ వద్ద గుమికూడిన జనం

బద్వేలు అర్బన్ : స్థానిక బైపాస్ రోడ్డులో ఓ స్థలం విషయంపై జరిగిన ఘర్షణలో బుధవారం ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు స్థానిక పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులోని సర్వే నంబర్ 1152లో గల 7.38 ఎకరాల స్థలంలో కోర్టు ఉత్తర్వుల మేరకు సుమారు రెండు నెలల క్రితం రిజిస్టర్ చేయించుకున్న క్రిష్ణమూర్తి, భాస్కర్‌లు స్థలం వద్దకు వెళ్లగా అదే స్థలాన్ని గతంలో రిజిస్టర్ చేయించుకున్న కొందరు తమపై దాడి చేసినట్లు క్రిష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అయితే గతంలో రిజిస్టర్ చేయించుకున్న సుమారు 150 మంది బాధితులు కూడా తమకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు. భూ సమస్యలు తమ పరిధిలోకి రావని, కేవలం అక్కడ జరిగిన ఘర్షణకు సంబంధించి ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేశామని, ఏదైనా ఉంటే రెవెన్యూ అధికారుల వద్ద తేల్చుకోవాలని బాధితులకు పోలీసులు తెలిపారు.

ఇళ్ల స్థలాలు కేటాయించండి

చాపాడు : మండల పరిధిలోని శ్రీరాములపేట దళితవాడకు చెందిన దళితులు తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు వేమారెడ్డితో కలసి బుధవారం తహసీల్దారు సుభానీకి వినతిపత్రం అందజేశారు. గత ఎన్నో ఏళ్లుగా ఉమ్మడి కుటుంబంలోనే జీవనం సాగిస్తున్నామని ఇళ్లు వేసుకునేందుకు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అర్హులైన దళితులకు పంపిణీ చేయాలని గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య, వీరమోహన్, వీరేంద్ర, సుబ్బరాయుడు, మోహన్‌లతో 30 కుటుంబాల చెందిన వారు తహసీల్దారును కోరారు.



కోడి పందేలు నిర్వహిస్తే కేసులు

ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలతో పాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. సాంప్రదాయాలకు ప్రతీకగా పిలిచే అతి పెద్ద పండుగైన సంక్రాంతిని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సంతోషంగా జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఎంతో పవిత్రమైన పండుగ రోజు జూదం ఆడరాదని, అక్రమ మద్యం విక్రయాలు, మద్యం అక్రమ రవాణా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదని వివరించారు. వీటిని అరికట్టేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ పేర్కొన్నారు. కోడి పందేల బరుల నిర్వహణ కోసం తోటలు, ఖాళీ ప్రదేశాలను ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఊళ్లకు వెళ్తే పోలీసులకు చెప్పండి: సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎస్పీ తెలిపారు. విలువైన వస్తువులను ఇంట్లో పెట్టుకోరాదని సూచించారు. నిఘా కెమెరాల కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని 9121100702 అనే మొబైల్ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రొద్దుటూరు క్రైం : జ్వరాలపై అప్రమత్తత అవసరమని డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు. మండలంలోని సోములవారిపల్లె పంచాయతీ పరిధిలోని పెన్నానగర్‌లో బుధవారం జ్వరాలపై సర్వే నిర్వహించారు. మూడవ సచివాలయం పరిధిలో ఐదేళ్ల బాలుడికి డెంగీ రావడంతో కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఈ సర్వే చేపట్టారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి అనుమానితులకు పరీక్షలు నిర్వహించారు.